ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 7 డిసెంబరు 2025





పిల్లలు చదువుతుండగా ఫొటో తీస్తున్న పర్యవేక్షకులు



పిల్లలకు భోజనం వడ్డిస్తున్న చిత్రాన్ని అప్‌లోడ్ చేస్తున్న హాస్టల్ పర్యవేక్షకులు

# వసతిగృహాల నిర్వహణ ఇక పక్కాగా..

**నిరంతర పర్యవేక్షణకు కొత్త యాప్**

**విద్యార్థులు నిద్రలేచింది మొదలు పడుకునే వరకు అన్ని వివరాల నమోదు**

**వార్డెన్లకు అవగాహన కల్పించాం**

వసతిగృహాల నిర్వహణ పారదర్శకంగా ఉండేందుకు హెచ్‌పీటీఎస్ యాప్ ఉపయోగపడుతుంది. దీని వినియోగంపై వార్డెన్లకు ఇప్పటికే అవగాహన కల్పించాం.

- విక్రమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి

| కేటగిరి | వసతి గృహాలు | విద్యార్థులు |
|---|---|---|
| బీసీ | 59 | 4,544 |
| ఎస్సీ | 60 | 5,400 |
| ఎస్టీ | 23 | 4,650 |

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వసతిగృహాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పర్యవేక్షణ, పారిశుధ్యం, భోజనం, సౌకర్యాల లోపాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వాటికి తావులేకుండా నిత్య పర్యవేక్షణ కోసం కృత్రిమ మేధ ఆధారిత ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. హాస్టల్స్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం(హెచ్‌పీటీఎస్) పేరుతో ఏఐ వ్యవస్థతో పనిచేసే ఈ యాప్ విద్యార్థులు నిద్రలేచినప్పటి నుంచి తిరిగి నిద్రకు ఉపక్రమించే వరకు ప్రతి అంశాన్నీ అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్లేట్లు కడగడం మొదలు పిల్లల హాజరు, భోజనాలు, వంట చేస్తున్న పరిసరాలు, ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్ల శుభ్రత తదితర అంశాలకు సంబంధించి ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేయాలి. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో, వార్డెన్ల సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. వీటిని జిల్లా కేంద్రానికి అనుసంధానం చేశారు.

**అన్ని వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి..**

ఈ యాప్ ద్వారా హాస్టళ్లకు సంబంధించిన అన్ని వివరాలు జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారుల దృష్టికి వెళతాయి. ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు.. వారికి ఎంత ఆహారం కావాలి.. ఆ మేరకు వండుతున్నారా.. అందులో వేయాల్సిన పదార్థాలు మోతాదు మేరకు వాడుతున్నారా.. వాటి నాణ్యత ఎలా ఉంది.. తిన్న ప్లేట్లను సరిగా శుభ్రం చేస్తున్నారా అనేది అధికారులు పరిశీలిస్తారు. ఎక్కడైనా తేడా ఉంటే వెంటనే వార్డెన్‌కు ఫోన్ చేసి మందలిస్తారు. సౌకర్యాల కొరతపైనా దృష్టి సారించి, సరిదిద్దే అవకాశం ఉంటుంది.





పెట్రోల్ బంకు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

# హెల్మెట్ ఉంటేనే పెట్రోల్

సూళ్లూరుపేట/నాయుడుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఉంటేనే పెట్రోల్ పట్టాలని పోలీసులు సూళ్లూరుపేట పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం పోలీసుస్టేషన్‌లో పెట్రోల్ బంకుల యజమానులతో సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు సమావేశమయ్యారు. ఈనెల 15వ తేదీ నుంచి 'నో హెల్మెట్... నో పెట్రోల్' అమలు చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వాహనదారులు సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కాగా, శనివారం సాయంత్రం నాయుడుపేటలోని అన్ని పెట్రోల్ బంకుల వద్ద అర్బన్ సీఐ బాబి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.



# భారీగా ఎస్ఐల బదిలీలు

- 10 మందికి స్థానచలనం
- 30 మంది పీఎస్ఐలకు పోస్టింగ్

తిరుపతి(నేరవిభాగం),డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 10 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. అలాగే ఐదు నెలల క్రితం శిక్షణ కోసం వివిధ స్టేషన్లలో ప్రొబేషనరీ ఎస్ఐలుగా నియమితులైన మరో 30 మందికి పోస్టింగ్‌లు ఇస్తూ ఎస్పీ సుబ్బరాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

**బదిలీ అయిన రెగ్యులర్ ఎస్ఐలు..**

బి.రాఘవేంద్రను భాకరాపేట నుంచి పిచ్చాటూరుకు, టి.వెంకటసుధాకర్ గాజులమండ్యం నుంచి ఎస్పీ తిరుపతికి, ధర్మారెడ్డి వడమాలపేట నుంచి ఎస్పీ తిరుపతికి, సి.వెంకటేష్ పిచ్చాటూరు నుంచి శ్రీకాళహస్తి రూరల్‌కు, షేక్ షావలీ తిరుపతి రూరల్ నుంచి డీసీఆర్‌బీ, తిరుపతికి, తలారి ఓబయ్య తిరుపతి వీఆర్ నుంచి డీసీఆర్‌బీ తిరుపతికి, శివాజీ మహిళా పీఎస్ నుంచి డీసీఆర్‌బీ తిరుపతికి, ప్రియాంక ఎస్పీ తిరుపతి నుంచి శ్రీసిటీకి, రమేష్‌బాబు తిరుమల వన్‌టౌన్ నుంచి ఎస్పీ తిరుపతికి, సీ చలపతి తిరుమల వన్‌టౌన్ నుంచి ఎస్పీ తిరుపతికి బదిలీ అయ్యారు.

**30 మంది పీఎస్ఐలకు పోస్టింగ్‌లు**

జిల్లాలో ఐదు నెలలుగా వివిధ పోలీస్ స్టేషన్లలో ప్రొబేషనరీ ఎస్ఐలుగా పనిచేస్తున్న 30 మందికి పోస్టింగ్‌లు కేటాయించారు. సూరే నాగరాజు అలిపిరి నుంచి గాజులమండ్యంకు, సుబ్బారెడ్డి తిరుపతి ఈస్ట్ నుంచి ఎస్వీయూకు, దుర్గాప్రసాద్ ఎస్వీయూ నుంచి అలిపిరికి, ఎస్వీ సుబ్బారెడ్డి తిరుపతి వెస్ట్ నుంచి శ్రీకాళహస్తి వన్‌టౌన్‌కు, వడ్డే అశోక్ తిరుచానూరు నుంచి పుత్తూరుకు వెళ్లారు. అలాగే శ్రీరాములు తిరుపతి రూరల్‌కు, తరుణ్ చంద్రగిరి నుంచి శ్రీసిటీకి, బండి హరీష్ పాకాల నుంచి వడమాలపేటకు, లోకేష్ ఎర్రావారిపాళ్యెం, అరవ సిద్దారెడ్డి భాకరాపేట నుంచి తిరుచానూరుకు, హుస్సేన్‌బాబా ఏర్పేడు నుంచి తిరుపతి ఈస్ట్‌కు, సుధీర్‌కుమార్ రెడ్డి బీఎన్ కండ్రిగ నుంచి శ్రీసిటీకి, కురుబ జ్యోతి తిరుపతి ఈస్ట్ నుంచి తిరుపతి రూరల్‌కు, స్వాతి తిరుచానూరు నుంచి అలిపిరికి, రాజాపవన్ కుమార్ నారాయణవనం నుంచి భాకరాపేటకు, సూరే హరీషా తిరుపతి రూరల్ నుంచి వెస్ట్‌కు, శ్రీనివాసులు పిచ్చాటూరు నుంచి నారాయణవనానికి, బుడ్డా స్వాతి రేణిగుంట నుంచి తిరుపతి ఈస్ట్‌కు, ప్రవల్లిక గాజులమండ్యం నుంచి చంద్రగిరికి, వెంకటరమణ శ్రీకాళహస్తి వన్‌టౌన్ నుంచి తొట్టంబేడుకు, వెంకటలక్ష్మి ఏర్పేడు నుంచి పుత్తూరుకు, ఇమ్మాన్యుయల్ కేవీబీపురం నుంచి శ్రీకాళహస్తి రూరల్‌కు, శ్రీకాంత్ సత్యవేడు నుంచి రేణిగుంటకు, శ్రీవాణి శ్రీకాళహస్తి వన్‌టౌన్ నుంచి అలిపిరికి, ఫైజీ పుత్తూరు నుంచి ఎస్వీయూకు, హరిత శ్రీకాళహస్తి టూటౌన్ నుంచి రేణిగుంటకు, ప్రసాద్ నాగలాపురం నుంచి తిరుపతి ఈస్ట్‌కు, అరుణాచలం శ్రీకాళహస్తి రూరల్ నుంచి చంద్రగిరికి, ఎర్రని జ్యోతి తొట్టంబేడు నుంచి శ్రీకాళహస్తి టూటౌన్‌కు, బి.లావణ్య వడమాలపేట నుంచి సత్యవేడు అడిషనల్ ఎస్ఐగా నియమించారు.



# సమస్యల ఏకరువు

- సభ్యుల చర్చతోనే ముగిసిన జడ్పీ సమావేశం
- మళ్లీ గైర్హాజరైన జిల్లాస్థాయి అధికారులపై చర్యలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లాలో నెలకొన్న సమస్యలను సభ్యులు ఏకరువు పెట్టారు.అయితే సమావేశానికి కొన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు రాకపోవడంతో ఎలా చర్చించాలని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎవరెవరు సమావేశానికి హాజరు కాలేదో వారందరిపై చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. ముందుగా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు జడ్పీ పరిధిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను వివరించారు.సమావేశానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎవరూ హాజరు కాలేదు.ఒక్క ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాత్రం హాజరయ్యారు.జిల్లాలో అధికంగా నమోదవుతున్న స్క్రబ్ టైఫస్ కేసుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం, రామసముద్రం జడ్పీటీసీ రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాధి ఇంకా ప్రబలక ముందే అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని, ఎక్కడికక్కడే పరీక్షా కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ వ్యాధి ఎలా వ్యాపిస్తుందనే విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పిల్లలు తరచూ ఫుడ్ పాయిజన్ బారిన పడుతున్నారని , నెలకు రెండు సార్లు విధిగా వైద్యుల బృందం హాస్టళ్లను సందర్శించాలని కోరారు.జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పడమటి మండలాల్లో రైతులకు యూరియా అందడం లేదని, గత రెండు సమావేశాల్లో దీన్ని ప్రస్తావించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై కలెక్టర్ కలగజేసుకొని వ్యవసాయ శాఖ వచ్చే మూడు నెలల్లో ఏం చేస్తుంది? యూరియా పంపిణీలో కిందిస్థాయి అధికారులకు ఏ విధమైన సూచనలు ఇచ్చారో సభలో వివరించాలని అధికారులకు సూచించారు.నారాయణవనం జడ్పీటీసీ సుమన్ మాట్లాడుతూ సొంత స్థలాలున్నవారు ఇంటి నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి పోతే రూ.25 వేలు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంకా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయలేదనగా వారంలో అందజేస్తామని వ్యవసాయ అధికారులు చెప్పారు. ఎర్రావారిపాళ్యం,వడమాలపేట జడ్పీటీసీలు కరుణాకర రెడ్డి,మురళీరెడ్డి,బంగారుపాళ్యం ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ జిల్లాలో గోకులం షెడ్లన్నీ అనర్హులకే కేటాయించారని ఆరోపించారు.స్పందించిన డ్వామా పీడీ అనర్హులకు షెడ్లు మంజూరు చేయలేదని చెప్పడంతో కొంత మంది సభ్యులు లేచి అనర్హులకు ఇవ్వలేదని తేలిస్తే రాజీనామా చేస్తామంటూ ఆవేశపడ్డారు.కలెక్టర్ కలగజేసుకొని ఎవరెవరు అర్హులున్నారో వివరాలు సేకరించి ఇస్తే పరిశీలించి షెడ్లు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.పెద్దమండ్యం ఎంపీపీ పూర్ణచంద్రిక మాట్లాడుతూ దళారుల కారణంగా టమోటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మదనపల్లె, పలమనేరు, గుర్రంకొండ... ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో రేటు ఎందుకుందో అధికారులు చెప్పాలని నిలదీశారు.ఉపాధి పనుల మస్టర్లను పరిశీలించాలని అడిగితే కలెక్టర్ చూపవద్దన్నారని ఏపీవో చెప్పారంటూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గుడుపల్లె మండలం సోడిగంపల్లి జడ్పీ హైస్కూల్‌కు త్రీఫేజ్ కరెంటు లేక తాగునీటికి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని జడ్పీటీసీ కృష్ణమూర్తి చెప్పగా స్పందించిన కలెక్టర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గుడుపల్లె నుంచి ఇరిసిగానిపల్లి, వెంకటాపురం గ్రామాలకు వెళ్లేందుకు మార్గం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఒక్క వంతెన నిర్మిస్తే 10 గ్రామాల రాకపోకలకు ఇబ్బంది తీరుతుందని వివరించారు.డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# బాంబులు పెట్టాం..ఎప్పుడైనా పేలొచ్చు

- హోటళ్ల యాజమాన్యాలకు మెయిల్స్
- తనిఖీలు చేసి ఉత్తిదే అని తేల్చిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'బాంబులు పెట్టాం.. అవి ఏ సమయంలోనైనా పేలొచ్చు..' అంటూ నగరంలోని రిపబ్లిక్ ఇన్, బ్లిస్ హోటల్స్ యాజమాన్యాలకు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ తీవ్రవాదుల పేరుతో శనివారం మధ్యాహ్నం మెయిల్ రావడం కలకలం రేపింది. బ్లిస్ హోటల్ మేనేజర్ కబీర్ ఆ మెయిల్‌ను ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు పంపారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో సీఐతో పాటు సిబ్బంది, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ హోటళ్ల వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. వంట గదులు, రూములు, కారు పార్కింగ్ ప్రాంతాలు, రిసెప్షన్, బాల్కనీ, వీఐపీలు వేచి ఉన్న గదులు, డైనింగ్ రూములు, వాష్‌రూములు, ఇతర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను తనిఖీ చేశారు. రెండు గంటలపాటు తనిఖీలు చేసిన అనంతరం అవి ఉత్తుత్తి బెదిరింపులేనని తేల్చారు. తిరుపతికి వరుసగా బాంబు బెదిరింపు కాల్స్ వస్తుండటంతో పోలీసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## స్విమ్స్‌లో పీజీ కోర్సులకు స్పాట్ కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో పీజీ కోర్సులకు సంబంధించి ఎంఎస్సీ బయోటెక్నాలజీ-2, బయోఇన్ఫర్మేటిక్స్ 2 సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీన్ అలోక్‌సచిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 10న మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించి, సీట్లు కేటాయిస్తామని వివరించారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

## 8 నుంచి ఎస్వీయూలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో పీజీ (ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ) కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 8వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు ఈ ప్రక్రియ చేపడతారు. ఏపీ పీజీసెట్-2025 రాసిన వాళ్లూ, రాయని వాళ్లు, ఉత్తీర్ణత సాధించిన, సాధించని వారు కూడా ఇందులో ప్రవేశానికి అర్హులు. 8వ తేదీ కామర్స్, కంప్యూటర్ సైన్స్, 9న సైన్స్, 10వ తేదీ ఆర్ట్స్ విద్యార్థులు ఎస్వీయూలోని అడ్మిషన్స్ కార్యాలయానికి హాజరుకావాల్సి ఉంటుంది. సమగ్ర సమాచారం కోసం 0877-2248589లో సంప్రదించవచ్చునని ఎస్వీయూ రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు తెలిపారు.



## క్రమశిక్షణతో సేవలందించండి

- నూతన ఎస్ఐలతో ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ సుబ్బరాయుడు నూతన ఎస్ఐలకు సూచించారు.కొత్తగా నియమితులైన 30 మంది ఎస్ఐలతో పోలీసు అతిథిగృహంలో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు.విధి నిర్వహణలో ఎలా మెలగాలి.. ప్రజలతో ఎలా మమేకం కావాలి...ఫ్రెండ్లీ పోలీసింగ్ గురించి ఎస్పీ వివరించారు. సాంకేతిక నైపుణ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

## ఎస్వీయూ పీజీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలోని పీజీ రెగ్యులర్, డిస్టెన్స్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఈ ఫలితాలను పొందుపర్చినట్లు వర్సిటీ పరీక్షల డీన్ సురేంద్రబాబు, సీఈ డాక్టర్ రాజమాణిక్యం తెలిపారు.

## ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

తిరుపతి(విద్య), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) డైరెక్టర్ ఆర్. నరసింహరావు శనివారం విడుదల చేశారు. 10వ తరగతి పరీక్షలు 2026 మార్చి 16 నుంచి 28వ తేదీ వరకు, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనున్నాయి. ఇంటర్ పరీక్షలు 2026 మార్చి 2 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నాయి. విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 10వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుంతో ఈ నెల 11, 12 తేదీల్లోగా, రూ.50తో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చు.

# సంస్కృత వర్సిటీలో కీచక పర్వం

**ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ సస్పెన్షన్**



ప్రొఫెసర్ లక్ష్మణరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న కీచకపర్వమిది. ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌కుమార్ ఒడిశాకు చెందిన డిగ్రీ విద్యార్థినితో సంబంధం పెట్టుకుని గర్భవతిని చేయగా అదే విభాగానికి చెందిన మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. శేఖర్‌రెడ్డి వారి రాసలీలలను సెల్ ఫోన్‌లో చిత్రీకరించినట్టు సమాచారం.ఆ వీడియోలను చూపి శేఖర్‌రెడ్డి కూడా లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.బాధిత విద్యార్థిని యూనివర్సిటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో లక్ష్మణ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. బాధిత విద్యార్థిని ఇటీవల టీసీ తీసుకొని ఒడిశాలోని సొంత ప్రాంతానికి వెళ్లి పోగా వర్సిటీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసే ప్రయత్నం చేశారు. అయితే ఫిర్యాదును బాధితురాలు ఇవ్వాలని పోలీసులు సూచించడంతో సస్పెన్షన్‌తో సరిపెట్టేశారు.ఈ విషయమై రిజిస్ట్రార్ వెంకట నారాయణరావును అడగ్గా బాధిత విద్యార్థిని ఫిర్యాదుతో ఈ ఘటనపై లోతుగా విచారణ చేపడుతున్నామని చెప్పారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనకు తావివ్వకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.సుదీర్ఘ చరిత్ర కల్గిన సంస్కృత విశ్వవిద్యాలయంలో చోటు చేసుకుంటున్న ఘటనలు తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. కొంత కాలం క్రితం యూనివర్సిటీలో డ్రగ్స్ పట్టుబడగా ఇప్పుడు కీచకపర్వం బయటపడి విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ మసకబారుతోంది.

## ఎస్సెస్సీ నామినల్‌రోల్స్‌లో సవరణలకు అవకాశం

తిరుపతి(విద్య), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సెస్సీ - 2026 పబ్లిక్ పరీక్షలకు సంబంధించి యూడైస్, పోర్టల్‌లో నమోదుచేసిన నామినల్ రోల్స్‌లో తప్పులుంటే సవరణలు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. మార్పులు అవసరమైన విద్యార్థులు త్వరితగతిన పూర్తిచేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎంలు వివరాలను పరిశీలించి సరిదిద్దాలని ఆదేశించారు. మరిన్ని వివరాలకు http://bse.ap.gov.in లింక్‌ద్వారా విద్యాశాఖ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

# అంబేడ్కర్ పోరాటం భావితరానికి ఆదర్శం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమానత్వం, సామాజిక న్యాయం కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన పోరాటం భావితరాలకు ఆదర్శమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తిరుపతి ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ నివాళులర్పించారు. అంబేడ్కర్ సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎస్పీ సుబ్బరాయుడు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువన్షి, కార్పొరేషన్ల చైర్మన్లు నరసింహయాదవ్, రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ మంత్రి పరసారత్నం, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఆర్టీసీ బస్టాండు కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు



# చంద్రగిరి

## పది పరీక్షలకు వంద రోజుల కార్యాచరణ ప్రారంభం

తిరుపతి(విద్య), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వంద రోజుల తరువాత పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. విద్యాశక్తి పేరుతో 100 రోజులపాటు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. శనివారం నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మొత్తం 609 ఉండగా 27,455 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. 230 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 14,656 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. 100 రోజులపాటు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎస్ఏ-1 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులనుబట్టి ఎ, బి, సి, డిలుగా విభజించారు. చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన మెటీరియల్‌ను బోర్డ్ ఆఫ్ సెకండరీ గ్రేడ్ ఎడ్యుకేషన్ విడుదల చేసింది. రెండవ శనివారాలు, ఆదివారాలు కూడా సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు, పదవ తరగతి విద్యార్థులకు సెలవును రద్దు చేశారు. అదనంగా సాయంత్రపు తరగతులను నిర్వహించనున్నారు.

## రహదారుల్లో ప్రమాదాల నివారణే లక్ష్యం


సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్

చంద్రగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చంద్ర గిరి మండల పరిధి లోని పూతలపట్టు -నాయుడుపేట, తిరు పతి -మదనపల్లె జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పని చేయాలని సీఐ సురేష్ కుమార్ తెలిపారు. శనివారం చంద్రగిరి మండలంలోని ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది, హైవే పెట్రోలింగ్ పోలీసులతో సీఐ సురేష్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలో నిత్యం ప్రమాదాల జరిగే ప్రదేశాలలో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో జాతీయ రహదారి సిబ్బంది, పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది నిత్యం గస్తీ నిర్వహించి అతి వేగంగా ప్రయాణించే వాహనాలను గమనించి అదుపు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సిబ్బందితో జాతీయ రహదారిలోకి వెళ్లి ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎస్ఐ రవీంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టీయూ అధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య



రమేష్, ఈశ్వరయ్య

ఎర్రావారిపాళెం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఎన్నిక శనివారం జరిగింది. ఎస్టీయూ అధ్యక్షులుగా కే.రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య, కోశాధికారిగా నాగమోహన్, మహిళా కన్వీనర్‌గా జ్ఞానేశ్వరి ఎన్నికయ్యారు. ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అంజిమేటి మల్లేశ్వర్, పలువురు ఉపాధ్యాయులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగమించవచ్చు

రామచంద్రాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలు, కిశోర బాలికలు పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగ మించవచ్చని అంగన్వాడీ పర్యవేక్షకురాలు మనీలా అన్నారు. మండలంలోని సి.రామాపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమం నిర్వ హించారు. అందులో భాగంగా పోషకాహార లోపం, క్యాన్సర్ నివారణ, బాల్య వివాహాలు వల్ల జరిగే అనర్థాలను వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు సరస్వతి, వరాలు, అంగన్వాడీ కార్యకర్త వెంకటమునెమ్మ, హెల్పర్ రుక్మిణీదేవి, చిన్నారులు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సేవాభావాన్ని అలవరుచుకోవాలి

భాకరాపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవాభావాన్ని అలవరుచుకోవాలని ప్రిన్సిపాల్ విశ్వనాథ నాయక్ కోరారు. కుమ్మర పల్లెలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో, పరిసరాలలో ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియన్ అధ్యాపకులు నాగరాణి, ఎన్ఎస్ఎస్ అధికారి రవీంద్ర, సర్పంచ్ మనోహర తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ విద్యార్థులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయచంద్ర, అధ్యాపకులు

తిరుపతిరూరల్, డిసెం బరు6 (ఆంధ్ర జ్యోతి): కరకం బాడి రోడ్డు లోని శ్రీరామ ఇంజి నీరింగ్ కళా శాల లో ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

## ఎర్రావారిపాళెం ఎస్ఐగా విశ్వనాథలోకేష్



ఎర్రావారిపాళెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రావారిపాళెం ఎస్ఐగా ఇక్కడే ట్రైనీ ఎస్ఐగా ఉన్న విశ్వనాథలోకేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్ఐ బాల కృష్ణయ్యను జిల్లా పోలీస్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు శనివారం బాలకృష్ణయ్య రిలీవ్ కాగా విశ్వనాథలోకేష్ బాధ్యతలు చేపట్టారు.

## తిరుపతి రూరల్ ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం) డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ స్టేషన్ ఎస్ఐలుగా శ్రీరాములు, జ్యోతిలు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు వారు డీఎస్పీ ప్రసాద్, సీఐ చిన్నగోవిందులను మర్యాదపూర్వకంగా కలిశారు.


ఎస్వీ యూనివర్శిటీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు శంకర్‌యాదవ్, నేతలు అశోక్ సామ్రాట్, మధుసూదన్ తదితరులు

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చంద్రగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు అంతరాజి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తిరుపతిలోని అమెరికన్ కంటి హాస్పిటల్ వైద్య బృందంతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నారు. శ్రీనివాసమంగాపురం, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అచ్చమ్మ అగ్రహారంలో చోరీ

పాకాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చమ్మ అగ్రహారంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు 24 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించారు.. గ్రామానికి చెందిన దామోదరనాయుడు మూడు రోజుల క్రితం కుటుంబసభ్యులతో గుంతకల్లుకు వెళ్లాడు. ఈ క్రమంలో దొంగలు ఇంటి తలుపు పగులగొట్టి బీరువాలోని 16 గ్రాముల బ్రాస్‌లెట్, 8 గ్రాముల కమ్మలు చోరీ చేశారు. శుక్రవారం ఇంటి తలుపులు తీసివున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుదర్శన ప్రసాద్ ఆ ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో వేలిముద్రలు సేకరించారు. దామోదరనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## విద్యాప్రమాణాల పెంపునకు ఎంఎఫ్‌సీ మార్గదర్శి

ఎర్రావారిపాళెం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యాప్రమాణాలకు మండల అకడమిక్ ఫోరమ్ కమిటీ మార్గదర్శిగా ఉందని ఎంఈఓ బాల సుబ్రమణ్యం అన్నారు. శనివారం మండలంలోని ఉస్తికాయలపెంట, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను అకడమిక్ ఫోరం కమిటీ సందర్శించింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యా లను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఈ పర్యటనలో ఎంఈవో-2 సతీష్‌బాబు, ఫోరం సభ్యులు సిద్ధయ్య, నరేంద్ర, గోవిందయ్య, కుమార్ స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భాకరాపేట ఎస్ఐగా రాజాపవన్‌కుమార్



భాకరాపేట, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): భాక రాపేట ఎస్ఐగా రాజా పవన్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాఘవేంద్ర బదిలీపై పిచ్చాటూరుకు వెళ్లారు. రాజాపవన్‌కుమార్ నారాయణ వనంలో ట్రైనీ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈయనకు పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## గరుడ వారధి నుంచి దూకిన యువకుడు

● తీవ్ర గాయాలు



తిరుపతి(నేర విభాగం), డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): గరుడ వారధి నుంచి ఓ యువకుడు దూకేశాడు. అదృష్టవశాత్తూ స్వల్పగాయాల పాలయ్యాడు. ఈస్ట్ ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు..తిరుపతి శ్రీనగర్ కాలానికి చెందిన పుష్యమిత్ర శనివారం రాత్రి ద్విచక్ర వాహనంలో గరుడ వారధిపై పూర్ణకుంభం సర్కిల్ సమీపంలో వాహనం ఆపాడు. లక్ష్మీపురం వైపు వెళ్లే వారధి నుంచి దూకేశాడు. అదృష్ట వశాత్తూ కింద ఉన్న కార్‌పై పడ్డాడు. దీంతో అతనికి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## అంబేడ్కర్‌కు ఘన నివాళి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీసు గ్రౌండులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా జరిగింది. ఎస్పీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. నేటి యువత అంబేడ్కర్ బాటలో నడవాలని కోరారు.

**తిరుపతిరూరల్:** తిరుపతిరూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్, ఏవో రంగనాథం, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు.


అంబేడ్కర్ చిత్రపటానికి హారతి ఇస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్

# ఆదర్శనీయుడు అంబేడ్కర్



చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద, చిన్నగొట్టిగల్లులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు

చంద్రగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఎంఈవో లలితకుమారి ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల యుటీఎఫ్ గౌరవాధ్యక్షుడు రామిరెడ్డి, అధ్యక్షులు రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ధనంజయ, కోశాధికారి చెంచయ్య, శ్రీరాములు, వెంకటరమణ, కృష్ణమూర్తిరెడ్డి, చలపతి, గోపాలకృష్ణ, సిద్దయ్య, హరిప్రసాద్, రవికుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ● సీపీఐ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు శ్రీరాములు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవైరాజా, రవిచంద్ర, రామారావు, శంకరయ్య, రవి పాల్గొన్నారు.

**రామచంద్రాపురం:** అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ మండలాధ్యక్షుడు జనార్ధన్‌నాయుడు అన్నారు. ఆర్‌సీపురంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లోకనాథం, మధు తదితరులు పాల్గొన్నారు.

**భాకరాపేట:** భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ అందరికీ స్ఫూర్తి ప్రదాత అని తహసీల్దారు భాగ్యలక్ష్మి అన్నారు. చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సతీశ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవోలు సోమశేఖరరెడ్డి, మురళి, డిజిటల్ అసిస్టెంట్ మురళి, ఎంఆర్‌పీఎస్ నాయకులు గురుశంకర, రవి, ఆదినారాయణ, హరిప్రసాద్, వెంకటరమణ, రామానుజులు, రాము, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులు


పాకాల అంబేడ్కర్ భవనం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న భవన కమిటీ సభ్యులు

పాకాల, డిశంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకొని శనివారం మండలంలో వాడ వాడలా ఆయన విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక అంబేడ్కర్ భవనం అధ్యక్షుడు జి.ఆంజినేయులు ఆధ్వర్యంలో భవనం ఎదుట, ఆర్టీసీ బస్టాండు ఎదుట అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రూపొం దించడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని, అంటరానితనం నిర్మూలనకు, అనగారిన సాధికారిత, సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ● స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి తాళ్ల రవీంద్రబాబు ఆధ్వ ర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ భవన ప్రధాన కార్యదర్శి గణేష్, ఉపాధ్య క్షుడు నాగరాజ, విశ్రాంత తహశీల్దార్ సుధాకరయ్య, డాక్టర్ రామ కృష్ణ, ఆదికేశవులు, గోపాలయ్య, శివప్రసాద్, జనవిజ్ఞాన వేదిక నాయకులు సాత్వకి నాయుడు, ఆటో యూనియన్ నాయకులు ఆనంద్, కేవీపీఎస్ జిల్లా నాయకులు సిద్దులు, రవి, నరేంద్ర పాల్గొన్నారు.

# రాస్ దివ్యాంగులకు చేస్తున్న సేవలు భేష్: ఆరణి


దివ్యాంగుల దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా రాస్ 40 ఏళ్లుగా దివ్యాంగులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభినందించారు. తిరుపతిలోని రాస్ ప్రధాన కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ దివ్యాంగులకు తమ సంస్థ అందిస్తున్న సేవలకు 20 ఏళ్ల క్రితం జాతీయ స్థాయి అవార్డు వచ్చిందన్నారు. అనంతరం దివ్యాంగులకు వీల్ ఛైర్‌లు, చేతికర్రలు, వినికిడి యంత్రాలు, చంక కర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ అధికారి శివయ్య, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, జనసేన నాయకులు రాజారెడ్డి, రాస్ సిబ్బంది నందిని, బాలాజీరెడ్డి, రవి, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఆశయసాధనకు కృషిచేద్దాం


సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

తిరుపతి(ఆటోనగర్),డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలని ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ కె.గురవయ్య కోరారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక సదరన్ డిస్కం కార్యాలయ ప్రాంగణంలో వున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కార్యాలయం ప్రాంగణంలో ఆయన చిత్రపటం పెట్టి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీజీఎంలు ఎం.మురళీ కుమార్, ఆదిశేషయ్య, పి.సురేంద్ర నాయుడు, చీఫ్ విజిలెన్స్ అధికారి ఎం.జనార్దన్‌నాయుడు, జాయింట్ సెక్రటరీ గోపాలకృష్ణ, జీఎంలు ప్రసాద్, జగదీష్, ఏపీఎస్ఈబీ ఎస్సీఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి టి.జయరామ్, బాబు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ● ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ వి.చంద్రశేఖర్, నిర్మాణాల విభాగం ఈఈ పుల్లా బాలాజీ తన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం పెట్టి నివాళులు అర్పించారు. ● పాత తిరుచానూరు రోడ్డులోని ఈఈ కార్యాలయం ప్రాంగణంలో ఈఈ సి.గంగాధర్‌రెడ్డి, టి.జయరామ్‌ల ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈలు ఆంజనేయులు, మునిప్రసాద్, జయప్రకాష్, వి.రమేష్, ఏఏవో బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయ విస్తరణ షురూ


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయం ఎట్టకేలకు విస్తరణకు నోచుకుంది. ఆలయానికి వాయువ్య ప్రాంతంలోని స్థలాన్ని కొనుగోలు చేసి విస్తరించాలని ఎప్పటినుంచో ప్రయత్నాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రక్రియ వేగవంతమైంది. టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ నేతృత్వంలోని పాలకమండలి నియామకం తర్వాత దాతల సహకారంతో రూ.50 లక్షల విలువైన స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ క్రమంలో శనివారం ఆలయ విస్తరణ పనులు మొదలుపెట్టారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు ఊకా విజయకుమార్, మబ్బు దేవనారాయణ రెడ్డి, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాసులు, శ్రీధర్ వర్మలు పాలకమండలిని అభినందించారు. పాత భవనాన్ని తొలగించి భక్తులకు సౌకర్యంగా ఉండేలా విస్తరించనున్నట్టు ఛైర్మన్ మహేష్ యాదవ్, ఆలయ ఈవో జయకుమార్ చెప్పారు.

## పోలీసు స్టిక్కర్‌తో వైద్యుల త్రిబుల్ రైడింగ్

● కౌన్సెలింగ్ ఇచ్చి స్టిక్కర్ తీయించిన ఎస్ఐ



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొందరు డాక్టర్లు తమ ద్విచక్ర వాహనానికి పోలీసు స్టిక్కర్ వేసుకుని త్రిబుల్ రైడింగ్ చేశారు. శనివారం సాయంత్రం స్థానిక ఎస్వీఆర్ సర్కిల్లో డ్యూటీలో ఉన్న ఎస్ఐ విజయలక్ష్మి వారిని ఆపి తనిఖీ చేశారు. తన తండ్రి పోలీసుగా పనిచేశాడని అందువల్లే స్టిక్కర్ వేసుకున్నామని ఒక డాక్టర్ చెప్పడంతో ఆ పోలీసు ఎవ్వరు? ఎక్కడ పనిచేశారు? ఆయన పేరు ఏమిటి అనే వివరాలు చెప్పాలని ఎస్ఐ గట్టిగా అడిగారు. దీంతో వారు నీళ్ల నమిలారు. అదంతా కట్టుకథ అని గుర్తించి ద్విచక్ర వాహనానికి ఉన్న పోలీసు స్టిక్కర్‌ను ఎస్ఐ వారితోనే తీయించారు. ఇలాంటి నకిలీ పోలీసు, ప్రెస్ స్టిక్కర్లు వేసుకుని తిరగడం నేరమని తెలియజేశారు.

# అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం


ఎస్డీహెచ్ఆర్ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ ఉష, అధ్యాపకులు

తిరుపతిరూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అవిలాల గ్రామపంచాయతీలో సర్పంచ్ చెందిలి వెంకటరమణ నేతృత్వంలో పలువురు నేతలు అంబ్కేడర్ విగ్రహానికి పుష్పాంజలితో నివాళి అర్పించారు. సర్పంచ్‌లు చెరుకుల జనార్ధన్‌యాదవ్, ముసుగు కోటేశ్వరరావు, పిపాసి, లక్ష్మీరాజా, లక్ష్మీశివ, ఎంపీటీసీ జయకర్, నాయకులు శ్రీరాములు, కిరణ్, జానకి రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు. ● పుదిపట్లలో సర్పంచ్ బడిసుధాయాదవ్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఓటేరులో స్వాతంత్ర్య సమరయోధులు రామకృష్ణారావు జ్ఞాపకార్థం స్థాపించిన అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షుడు సూర్యకిరణ్ నేతృత్వంలో నివాళి అర్పించారు. ఇస్మాయిల్, మోహన్, మహేష్ తదతరులు పాల్గొన్నారు.

● **ఎస్డీహెచ్ఆర్ కాలేజీలో:** న్యూబాలాజీకాలనీలోని ఎస్డీహెచ్ఆర్ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలితో నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ ఉష, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **అంబేడ్కర్ న్యాయకళాశాలలో:** రేణిగుంటరోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో పలువురు అధ్యాపకులతో కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ బిజయకుమార్ బెహరా, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. ఈకార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



తిరుపతి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి సుగుణమ్మ నివాసంలో శనివారం జరిగిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన వచ్చింది. మున్సిపల్ కార్పొరేషన్, పోలీస్ విభాగాలకు సంబంధించిన సమస్యలపై పలువురు 51మంది అర్జీలు సమర్పించారు. ఆయా విభాగాల అధికారులతో ఆమె మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చినబాబు, బుల్లెట్ రమణ దంపూరి భాస్కర్ యాదవ్, బీజీ కృష్ణ యాదవ్, కోడూరు బాలసుబ్రమణ్యం, పుష్పావతి, కరాటే చంద్ర పాల్గొన్నారు.

## రైల్వే జీఎం వస్తున్నారని..

తిరుపతి(సెంట్రల్)డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు వస్తారంటే స్టేషన్ ప్రాంగణాలను అధికారులు శుభ్రం చేస్తారు. పాత రోడ్డును మరమ్మతులు చేస్తారు. ఇందులో భాగంగా ఆర్‌సీ గేటు నుంచి దక్షిణం వైపు వున్న నూతన భవనం వరకు ఉన్న పాతరోడ్డును మర్మతులు చేపట్టారు. అడ్డువున్న చెట్లు తొలగించారు. నూతన భవనంలో చేపట్ట వలసిన పనులు వేగవంతం చేశారు. ఒకటవ నెంబరు ప్లాట్ ఫారంలో వున్న ఆటంకాలను తొలగించారు. 6వ నెంబరు ప్లాట్ ఫారంలో ఏడాది కాలంగా ఉన్న అడ్డాలని తొలగొంచారు. మిగిలిన రెండురోజుల్లో షిర్డీ రైలు ప్రారంభించడానికి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించారు.

## అంబేడ్కర్ ఎప్పటికీ మార్గదర్శకుడే

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి పరసారత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితం, త్యాగం, సామాజిక సేవ సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, కార్పొరేషన్ల ఛైర్మన్లు సుగుణమ్మ, నరసింహయాదవ్, సదాశివం, మాజీ ఎమ్మెల్యే గాంధీ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో వేగం పెంచండి

తిరుపతి(ఆటోనగర్) డిసెంబరు6 (ఆటోనగర్): తిరుపతి టౌన్‌డివిజన్ పరిధిలోని రేణిగుంట పారిశ్రామిక వాడలో నిర్మిస్తున్న 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని నిర్మాణాల విభాగం ఈఈ పుల్లా బాలాజీ ఆదేశించారు. శనివారం నిర్మాణాల విభాగం ఈఈ, ఆపరేషన్ విభాగం ఈఈ సి.గంగాధర్‌రెడ్డిలు పనులను పరిశీలించారు. ఈ సబ్ స్టేషన్ నుంచి వెళ్లే విద్యుత్ లైన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు వి.రమేష్, ఆంజనేయులు, మునిప్రసాద్, జయప్రకాష్, ఏఈ పుణ్యకోటి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి

## పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో వచ్చేనెల 10వ తేదీ నుంచి రెండు రోజులపాటు జరిగే పౌర హక్కుల సంఘం రాష్ట్ర 20వ మహాసభలను జయప్రదం చేయాలి ఆ సంఘం రెండు తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త క్రాంతి చైతన్య కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని తెలిపారు. దేశంలోని సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు ధారదత్తం చేయడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ పరిస్థితులు మారాలంటే ప్రశ్నించే తత్వం రావాలన్నారు. అంతకుముందు మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమలో ఈ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు, పౌర చైతన్య వేదిక గౌరవాధ్యక్షులు రాఘవశర్మ, సీనియర్ జర్నలిస్టు ఎం.నాగరాజు, పౌరహక్కుల సంఘం నాయకులు హేమాద్రి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పరకామణి కేసులో దోషులకు శిక్ష తప్పదు

● ఆముదాల తులసీరామ్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఆముదాల తులసీరామ్

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసులో దోషులకు శిక్ష తప్పదని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆముదాల తులసీరామ్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ పరకామణి కేసులో కీలక సాక్షి అయిన అధికారి సతీష్‌హత్యకు గురికావడం అనుమా నాలకు తావిస్తోందన్నారు. పరకామణిలో సుమారు రూ.200కోట్ల వరకు దోపిడీ జరిగిందని ఆరోపించారు. చోరీ కేసులో పట్టుబడిన రవికుమార్‌ను రక్షించడం వెనుక లాభపడినట్లు తెలుస్తోందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ పట్ల కరుణాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తమ నాయకుడు సంస్కారం నేర్పించారని అందుకే సంయమనం పాటిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కరుణాకర్‌రెడ్డి తన పద్ధతి మార్చుకోవాలని హితవుపలికారు. అధికారులను వాడు.. వీడు అంటూ జగన్ మాట్లాడడాన్ని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీపతినాయుడు, హేమంత్ యాదవ్, రమేష్ యాదవ్, ప్రసాద్‌రాయల్, అశోక్ పాల్గొన్నారు.

## దొంగను పట్టి శ్రీవారికి ఆస్తులు రాయించాం

● వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అజయ్‌కుమార్

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీలో దొంగను పట్టి అతని ఆస్తులను శ్రీవారికి రాయించామని వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అజయ్‌కుమార్ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో చోరీకి పాల్పడిన రవికుమార్‌ను సీసీ కెమెరాల సాయంతో గుర్తించి పట్టుకున్నామన్నారు. అతను చేసిన తప్పులకు కుటుంబ సభ్యులపైనున్న ఆస్తులను వెంకటేశ్వరస్వామికి రాయించేలా చేసినట్లు చెప్పారు. ఇదే విషయాన్ని వివరించిన తమ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మాటలను తప్పుదారి పట్టించేలా కూటమి నాయకులు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నల్లని బాబు, మద్దాలి శేఖర్, మోహన్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



రుయాస్పత్రిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఫార్మసిస్టుల అసోసియేషన్ నేతలు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలో పనిచేసే ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యతతో కృషి చేద్దామని ఫార్మసిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాదముని అన్నారు. ఏపీ ఫార్మాకౌన్సిల్ 2025 ఎన్నికల్లో భాగంగా ఆయన రుయాస్పత్రిలో ఫార్మసిస్టుల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, ప్యానెల్ సభ్యులు నరేష్, నాగకృష్ణంరాజు, బాలరాజునాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ అరుణ్‌సెల్వం తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభ్యున్నతికి అంబేడ్కర్ పూల బాట వేశారు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మన దేశానికి ఎంతో విలువైన రాజ్యాంగాన్ని అందించి ప్రజల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పూల బాట వేశారని అటువంటి మహనీయుడి ఆశయాలను సాధించేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు అన్నారు. అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి శివశంకర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటనరసింహులు, నాయకులు ఐరాల లోకేష్, జ్యోతిశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహానటి సావిత్రి జయంతి



సావిత్రి పురస్కారాలను కళాకారులకు ప్రదానం చేస్తున్న రంగస్థలి నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో మహానటి సావిత్ర 90వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. రాయలసీమ రంగస్థలి కార్యాలయంలో జరిగిన వేడుకల్లో సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇద్దరు రంగస్థల నటులకు సావిత్రి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎన్‌రాజా, కళాకారులు పాల్గొన్నారు. ● జీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జీఎస్‌ప్రసాద్, సభ్యులు కరుణానిధి, రెడ్డెప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్‌లపై అవగాహన కల్పించండి

● టౌన్ ప్లానింగ్ అధికారులతో కమిషనర్ మౌర్య

తిరుపతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన భవనాలు, అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం అందించిన ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్‌పై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందితో శనివారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్, ఐ.పీ.ఎల్.పీ దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లానింగ్ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అనధికార నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లను గుర్తించి నోటీసులు ఇవ్వాలని తెలిపారు. ఆగస్టు 31 వ తేదీ లోపు జరిగిన నిర్మాణాలను ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డీసీఈపీ ఖాన్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేడుకగా నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పురవీధుల్లో శనివారం నగర సంకీర్తన వేడుకగా జరిగింది. భజన మండలి కళాకారుల ఆధ్వర్యంలో జరిగిన ఈసంకీర్తనలో గోవింద నామస్మరణలు మార్మోగాయి. ఈ కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పద్మావతి, సిద్ధమ్మ, అరుణ, జయమ్మ, పార్వతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజారవాణాధికారి కార్యాలయంలో శనివారం ఉదయం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి డీపీటీవో జగదీష్ నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ, పీవో చాందిని, చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ సి.ఎస్.వర్మ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచం మెచ్చిన సామాజిక తత్వవేత్త అంబేడ్కర్

● వర్ధంతి సభలో ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు





అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు - అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న పద్మావతి వర్సిటీ రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం మెచ్చిన గొప్ప సామాజిక తత్వవేత్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతినాయుడు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం శనివారం ఘనంగా చేపట్టారు. తొలుత మెయిన్‌గేట్ వద్ద, సెంట్రల్ లైబ్రరీలో గల అంబేడ్కర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం సెనేట్ హాల్లో చేపట్టిన సభలో రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడిగా ఉన్నత విలువలను జీవితంలో పాటించిన అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శనీయమన్నారు. ద్రవిడ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెంచలయ్య మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడు దార్శనికత గల మేధావి అంబేడ్కర్ అని తెలిపారు. ఫిలాసఫీ అధ్యాపకులు డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ సమానత్వ భావనతో మనుషులు కలసి జీవించాలని అంబేడ్కర్ కలగన్నారని తెలిపారు. సీడీసీ డీన్ చెంద్రాయుడు అధ్యక్షతన జరిగిన సభలో ఎస్సీ ఎస్టీ, బీసీ లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు నాయక్, ప్రిన్సిపాళ్లు సుధారాణి, వెంకటేశ్వర్లు, అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● పద్మావతి మహిళా యూనివర్సిటీలో..

అంబేడ్కర్ చిత్రపటానికి రిజిస్ట్రార్ రజని పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. మహిళలకు సమాన అవకాశాలు దక్కాలని అంబేడ్కర్ కృషి చేశారని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రొఫెసర్ తవితా తులసి, డీన్లు వాణి, సుజాత, అంబేడ్కర్ స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ ఇందిరాముజీబ్, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎ చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రత్యేక ప్రతిభావంతులు

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని సీఎం చంద్రబాబు ప్రత్యేక ప్రతిభావంతులకు ఏడు వరాలు ప్రకటించిన నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద పీడబ్ల్యూడీ ఫెడరేషన్, ఇతర వికలాంగుల సంఘాలు కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర పీడబ్ల్యూడీ ఫెడరేషన్ నేతలు సుబ్రహ్మణ్యం, మురళి తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ఏడు వరాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు స్థానిక సంస్థల్లో కార్పొరేషన్, పబ్లిక్ సెక్టార్లకు ప్రాతినిథ్యం కల్పిస్తామని ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. అలాగే హౌసింగ్ కాలనీల్లో దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ కేటాయించడం, ఆర్థిక సబ్సిడీ పథకాలను వర్తింపజేయడం మహోన్నత కార్యక్రమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో విభిన్న ప్రతిభావంతుల నాయకులు రామచంద్ర, గోవర్ధన్, శివ, చిట్టెమ్మ, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో అంబేడ్కర్ వర్ధంతి



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను శనివారం నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● తిరుపతి రూరల్ సాయినగర్ పంచాయతీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్రపటానికి సర్పంచ్ డీవీ రమణ, కార్మికులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

## అంబేడ్కర్‌కు ఘన నివాళులు



తిరుపతి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్రపటానికి కమిషనర్ ఎన్. మౌర్య, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అధికారులు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజనీర్ తులసి కుమార్, డీసీపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, మేనేజర్ హసీమ్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా సిల్వర్ ఓక్స్ 12వ వార్షికోత్సవం



సిల్వర్ ఓక్స్ వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

తిరుపతి(విద్య), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక భవానీనగర్‌లోని సిల్వర్ ఓక్స్ పాఠశాల 12వ వార్షికోత్సవం మహతి కళామందిరంలో శనివారం వేడుకగా జరిగింది. పాఠశాల చైర్మన్ కేఎస్ వాసు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా విద్యార్థులను సమగ్రాభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు తమ పాఠశాల కృషి చేస్తోందని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కిండర్ గార్డెన్ చిన్నారులకు కాన్వొకేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సెస్సీ - 2025 పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శిరీష, ప్రైమరీ ఇన్‌చార్జ్ బి.లావణ్య, ప్రీప్రైమరీ ఇన్‌చార్జ్ మంజులాదేవి, పబ్లిక్ రిలేషన్ మేనేజర్ హరికృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మంగళం ట్రెండ్స్‌లో వందరోజుల ప్రణాళిక ప్రారంభం



స్టడీ అవర్‌లో పదవ తరగతి విద్యార్థులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల పబ్లిక్ సన్నద్ధత కోసం వంద రోజు ప్రణాళిక శనివారం ప్రారంభించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రణాళిక బద్ధంగా తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు ఆదేశించారు. సాయంత్రం పాఠశాల ఆవరణంలో స్టడీ అవర్ ఏర్పాటు చేశారు.

## సోషల్ మీడియాతో ప్రజలను చైతన్యం చేయండి

● సీపీఐ జాతీయ సమితి సభ్యులు పి.హరినాథరెడ్డి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాతో సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ చైతన్య పరచాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బైరాగి పట్టెడ లోని గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం సీపీఐ రాష్ట్ర సోషల్ మీడియా వర్క్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజకుమార్, సురేంద్ర, అజేయ్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో రాజ్యాంగ విలువలు పెంపొందించాలి

● డీఈవో కేవీఎస్ కుమార్



డీఈవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కేవీఎస్ కుమార్, అధికారులు, సిబ్బంది

తిరుపతి(విద్య), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రాజ్యాంగ విలువలు బోధించి వారిలో సమానత్వ భావన, సామాజిక చైతన్యం పెంపొందించాలని డీఈవో కేవీఎస్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శనివారం డీఈవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యారంగం బలపడాలని, విద్యార్థులు చైతన్యవంతులు కావాలని, అంబేడ్కర్‌కు మన మిచ్చే నిజమైన నివాళి ఇదేనని పేర్కొన్నారు. ఈకార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ ఐటీ సెల్ అధికారి ధనుంజయ నాయుడు, అకడమిక్ మానిటరింగ్ అధికారిడాక్టర్ చంద్రశేఖర్‌నాయుడు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు డాక్టర్ సుధాకర్, మీనాక్షి, సారథి, పుష్ప, భువనేశ్వరి, విద్యాశాఖ, సమగ్రశిక్ష కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 177 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,693, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,185 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,196 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 716, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 276, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 236, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 103 మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,171 అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు.

## టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): టీటీడీ బర్డ్ ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన ఏబీఆర్ కేఫ్ అండ్ బేకర్స్ సంస్థ ప్రతినిధులు బాబురావు, శశాంక్ ఈ విరాళాన్ని హైదరాబాద్‌లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు సదాశివరావు కూడా ఉన్నారు.

## సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**గురువారం హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు**

**శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,336**

**తలనీలాలు సమర్పించినవారు: 25,063**



SUNDAY FOCUS



గూడూరు గడియారం సెంటర్

### దుగరాజపట్నంతో ముడిపెట్టి అడ్డుకుంటారా?



తిరుపతి జిల్లాకు దుగరాజపట్నం పోర్టు ఉండాలనే గూడూరును తిరుపతిలో ఉంచుతున్నామని చెప్పడం సమంజసం కాదు. దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణానికి అవకాశం లేదని 2018లోనే నీతి అయోగ్ తేల్చి చెప్పింది. రాష్ట్ర విభజన హామీ చట్టంలో ఈ అంశం పొందిపరిచినా ముందుకు సాగలేదు. ఇప్పుడు మళ్లీ దాంతో ముడిపెట్టి అడ్డుకోవడం అన్యాయం.

**- వి.రాజేంద్రప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, గూడూరు**



నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్

● రగులుకుంటున్న డిమాండ్

# గూడూరు బంధం నెల్లూరుతోనే

**గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో తిరిగి కలపకుండా అడ్డుకుంటున్న అంశాలేమిటి? అడ్డుకుంటున్న శక్తులు ఎవరు? ఏ కారణాలు ప్రజల బలమైన ఆకాంక్షను కూడా లెక్కచేయడం లేదు? అధికార కూటమికి రాజకీయంగా తీవ్ర నష్టం కలిగించే నిర్ణయమని తెలిసీ ఎందుకు అడుగు ముందుకే వేస్తున్నారు?.. ఇవీ ఇప్పుడు గూడూరు నియోజకవర్గంలోనే కాకుండా, నెల్లూరు జిల్లాలోనూ, తిరుపతి జిల్లాలోనూ ప్రజల్లో మెదులుతున్న ప్రశ్నలు. ఇందుకు సహేతుక కారణాలున్నాయని చెబుతున్న అంశాలను ప్రజలు అసలు నమ్మడం లేదు. రోజురోజుకూ ఈ డిమాండ్ బలం పుంజుకుంటూనే ఉంది. వినతులు, వేడుకోళ్ల దశ దాటి నిరసనల స్థాయికి చేరుకుంది.**

**- గూడూరు, ఆంధ్రజ్యోతి**

### నెల్లూరులో ఎందుకు?

నెల్లూరుకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. భాష, యాస, ఆహారపు అలవాట్లలో ఈ ప్రత్యేకత కనిపిస్తుంది. తిరుపతి ప్రాంతానికి వీటికీ ఎంతో కొంత తేడాలుంటాయి. పైగా గూడూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నెల్లూరు జిల్లాలో కొనసాగుతూ వస్తోంది. బంధుబలగాలు, పెళ్లి సంబంధాలు, ఉపాధి పనులు, ఉద్యోగాలు, వ్యాపార సంబంధాలు, చదువులు, వైద్యం.. అన్నీ నెల్లూరుతోనే ముడిపడి ఉంటాయి. పైగా చేరువన ఉండే నెల్లూరును కాదని దూరంగా ఉండే తిరుపతితో అనుబంధం పెంచుకోవడం అంత సులువు కాదు.

### లేని, రాని పోర్టు కోసమా?

తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యతో నిరాశ పెంచింది. తిరుపతి జిల్లాకు కుడా ఒక పోర్టు ఉంటే అభివృద్ధి సమతుల్యంగా ఉంటుందనేది ప్రభుత్వ భావనని, అందుకే వాకాడు మండలంలోని దుగరాజపట్నం కోసం తిరుపతిలోనే కొనసాగించాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించినట్లు వివరించారు. దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణానికి 15 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అప్పటి ఎంపీ చింతామోహన్ పట్టుదల వల్ల రాష్ట్ర విభజన చట్టంలోనూ పొందుపరిచింది. దీంతో 2014లో దుగరాజపట్నంతో పాటు తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, పామంజి, వాగర్రు, శ్రీనివాసపురం గ్రామాల్లో సుమారు 2,700 ఎకరాల భూములను గుర్తించారు. అయినా పోర్టు నిర్మాణానికి ముందడుగు పడలేదు. సాంకేతికంగానూ, ఆర్థికంగానూ దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణం ప్రయోజనకరం కాదని అప్పట్లోనే నీతి అయోగ్ స్పష్టం చేసింది. దీంతో ఇది అటకెక్కింది. అప్పటి నుంచి నేటి వరకు కుడా కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ చింతామోహన్ దుగరాజపట్నం పోర్టు కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నా ఫలితం లేకుండా పోయింది. అయితే సీఎం చంద్రబాబునాయుడు ఈ ఏడాది మే నెలలో దుగరాజపట్నం వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.3,500 కోట్లతో నౌకానిర్మాణ కేంద్రాన్ని, ఓడల మరమ్మతుల యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. అంటే పోర్టు స్థానంలో ఇవి ఏర్పాటు చేస్తారన్నమాట. మరి పోర్టు కోసమే తిరుపతి జిల్లాలో కొనసాగించాలన్న నిర్ణయంలో అర్థమేమిటనే ప్రశ్న ప్రజల నుంచి వస్తోంది.

### వైసీపీ పాపం.. కూటమికి నష్టం

జగన్ ప్రభుత్వం నెల్లూరుతో పెనవేసుకున్న బంధాన్ని పుటుక్కున తెంచేసింది. తిరుపతి జిల్లాలో గూడూరు నియోజకవర్గాన్ని భాగం చేసింది. దీనిపై ఆ పార్టీ నాయకులెవరూ నోరు కూడా తెరవలేదు. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆకాంక్షను గ్రహించి ఎన్నికలకు ముందు నారా లోకేశ్, చంద్రబాబు ఇద్దరూ గూడూరును తిరిగి నెల్లూరులోనే కలుపుతామని హామీ ఇచ్చారు. వీరి మాటలపై నమ్మకంతో ఉన్న ప్రజలు తాజా నిర్ణయంతో విస్తుపోయారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే విలీనం చేయాలని మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించినా, అనంతరం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఈ అంశం లేదు. దీంతో ప్రజలు కోపంతో ఉన్నారు.

### మీరిచ్చిన హామీలకే విలువ లేదా?



గత ప్రభుత్వం అశాస్త్రీయ పద్ధతిలో గూడూరును తిరుపతి జిల్లాలో కలిపింది. అప్పట్లో ప్రజలు వ్యతిరేకించినా పట్టించుకోలేదు. ప్రజలు ఓట్ల ద్వారా తమ తీర్పును ప్రకటించారు. ఇప్పటి ప్రభుత్వం కూడా అదే దారిలో వ్యవహరిస్తోంది. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీలకే విలువ లేకపోతే ఎలా? గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేంత వరకు, జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత పోరాటాలు సాగిస్తూనే ఉంటాం.

**- బి.దశరథరామిరెడ్డి, జేఏసీ కన్వీనర్, గూడూరు**

### ఇంత కష్టపెట్టడం అవసరమా?



టీచర్లు శిక్షణా తరగతులు, కౌన్సెలింగ్, స్పాట్ వాల్యూయేషన్‌లకు జిల్లా కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. గూడూరు నుంచి నెల్లూరుకు 40 కిలోమీటర్లు. తిరుపతికి వెళ్లి రావాలంటే దూరం, కష్టం ఎక్కువ. ప్రజల కోరికను మన్నించి గూడూరును నెల్లూరులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలి.

**- ఎస్.చిరంజీవి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గూడూరు.**

### మా బంధాలు తెంచేసుకోవాలా?



నాకు ఇద్దరు చెల్లెళ్లు. ఇద్దరికీ నెల్లూరు సంబంధాలే చేసుకున్నాం. నాకు ఇద్దరు కుమారులు. పెద్ద కోడలిది అప్పటి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట. రెండో వాడికి ఇప్పటి నెల్లూరు జిల్లాలోనే సంబంధాలు చూస్తున్నాం. నెల్లూరుతోనే మా సంబంధబాంధవ్యాలన్నీ ఉంటాయి. మమ్మల్ని తీసకపొయ్యి తిరుపతిలో పెడితే ఎట్ల? ఇదేమి న్యాయం?

**- జీ.రామచంద్రయ్య, వ్యాపారి, గూడూరు**

### మా గోడు ప్రభుత్వానికి పట్టదా?



నేను సీజన్ వ్యాపారిని. పదేళ్లుగా గూడూరు నుంచి నెల్లూరుకు రోజూ వెళ్తాను. నెల్లూరు హోల్‌సేల్ షాపుల నుంచి స్టీల్ సామాన్లు తెచ్చి గూడూరులోని దుకాణాలకు అందిస్తుంటాను. గూడూరులో పది స్టీల్ సామాన్లు విక్రయించే దుకాణాలు ఉన్నాయి. ఇదే నా ఉపాధి. నెల్లూరుకు చార్జీల ఖర్చు తక్కువ కాబట్టి వ్యాపారం సాగుతోంది. ఇదే తిరుపతితో చేయగలనా? నా మాదిరే రోజూ నెల్లూరు పొయ్యి వ్యాపారాలు చేసుకునేవాళ్లు గూడూరు ప్రాంతంలో ఎందరో ఉన్నారు. మా గోడు ప్రభుత్వం వినాలి.

**- జే.సురేష్‌బాబు, సీజన్ వ్యాపారి, గూడూరు**



దుగరాజపట్నం గ్రామం

# దివ్యాంగులకు ప్రత్యేక హౌసింగ్ కాలనీ

● విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో కలెక్టర్ వెంకటేశ్వర్



క్రీడల్లో ప్రతిభచూపిన దివ్యాంగులను సత్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఉన్న దివ్యాంగులకు ప్రత్యేక హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇంటి వద్దకే పింఛను పంపిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, అందులో ఉచిత బస్సు ఒకటి అని అన్నారు. గృహ నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అంతకు ముందు విభిన్న ప్రతిభావంతులను సన్మానించారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన పురుషోత్తంరెడ్డి, కాంచన, దివ్య, విమల, శివ, కార్తీక్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు నరసింహయాదవ్, రుద్రకోటి సదాశివం, పసుపులేటి హరిప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు సుబ్రమణ్యం, మురళి, రామచంద్ర పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

# ఆరేళ్ల క్రితం ఫిర్యాదు.. ఇప్పుడు స్పందన

● బాధ్యుల్లో ఇప్పటికే చాలామంది ఉద్యోగ విరమణ ● ఫిర్యాదుదారుడు మృతి

● ఎవరిపై చర్యలు తీసుకోవాలో అర్థంగాక తలలు పట్టుకుంటున్న అధికారులు

డక్కిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల క్రితం చేసిన ఫిర్యాదుకు అధికారులు ఇప్పుడు స్పందించి చర్యలకు ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. డక్కిలి మండలం పలుగోడు పంచాయతీ పరిధిలోని నాగులపాడు, తిమ్మాయపాళెం, పలుగోడు, హరిజనవాడలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.30 లక్షలతో సిమెంటు రోడ్లు వేశారు. అయితే ఈ పనులు నాసిరకంగా జరిగాయంటూ పలుగోడుకు చెందిన రుషేంద్రరెడ్డి అప్పట్లోనే విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు చేశారు. విజిలెన్సు విభాగం అప్పట్లో విచారణ జరిపి నివేదిక తయారు చేసింది గాని, అది వెలుగులోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ నివేదికను బయటకు తీసి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమిస్తూ సంబంధిత శాఖలకు నోటీసులు జారీ చేసింది. అయితే ఆ సమయంలో పనులను పర్యవేక్షించిన అధికారులు చాలామంది ఇప్పటికే రిటైర్ అయ్యారు. ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఈఈగా పనిచేసిన రమణయ్య మాత్రమే ప్రస్తుతం నెల్లూరు పీఐయూలో డీఈగా ఉన్నారు. డీఈ, జేఈ వంటి ఇంజనీర్లు ఉద్యోగ విరమణ పొందారు. ఫిర్యాదుదారుడు రుషేంద్రరెడ్డి కూడా చనిపోయారు. దీంతో చర్యలు ఎవరిపై తీసుకోవాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

## హోంగార్డుల సేవలు అభినందనీయం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సేవలు అభినందనీయమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండులో హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో హోంగార్డులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, బాధ్యతతో పని చేయాలని కోరారు. ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని పీఎం సురక్ష బీమా యోజన వంటి పథకాల్లో చేరాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన హోంగార్డులకు ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, శ్రీనివాసులు, రామకృష్ణ, ఏవో రమేష్‌కుమార్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

## కార్బన్ కంపెనీలో మొబైల్ ఫోన్ల చోరీ

ఏర్పేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి సమీపంలో ఉన్న కార్బన్ మొబైల్ కంపెనీలో రెండు రోజుల క్రితం ఆ కంపెనీలో పనిచేస్తున్న నలుగురు కార్మికులు ఆరు మొబైల్‌ఫోన్లను చోరీ చేశారు. ప్యాకింగ్ సమయంలో చెక్ చేసుకున్న సిబ్బంది ఆరు మొబైళ్లు తక్కువ వచ్చాయి. ఈ క్రమంలో కంపెనీ అధికారులు పలువురు కార్మికులను విచారించారు. సీసీ ఫుటేజీని పరిశీలించారు. నలుగురు కార్మికులు మొబైల్ ఫోన్లను ఒక సెక్యూరిటీ గార్డు సాయంతో బయటకు తీసుకెళ్లినట్లు గుర్తించారు. శనివారం విధులకు వచ్చిన ఆ నలుగురు కార్మికులను కంపెనీ అధికారులు విచారించారు. తిరిగి అప్పగించాలని సూచించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొబైల్‌ఫోన్ల చోరీ వాస్తవమేనని, విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

# బీసీలంటే జగన్‌కు చిన్నచూపు

● ఆవు, లేగ దూడతో యాదవుల నిరసన

తిరుపతి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): బీసీలంటే వైసీపీ అధినేత జగన్ రెడ్డికి లెక్కలేదని, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదని యాదవ సంఘ నాయకులు మండిపడ్డారు. సీనియర్ ఐపీఎస్ అధికారులైన కృష్ణయ్య, గోపీనాథ్ జెట్టిలను వాడూ, వీడూ అని జగన్ వ్యాఖ్యానించడంపై తిరుపతి యాదవ సమైక్య సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద ఆవు, లేగ దూడలను పూజిస్తూ, ప్లకార్డులను చేతపట్టుకుని నిరసన తెలిపారు. వైసీపీ వైఖరితో బీసీలు చాలామంది ఆత్మహత్య చేసుకున్నారని మండిపడ్డారు. యాదవులకు జగన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, యాదవ సంఘ నాయకులు కట్ట జయరాం, ఈతమూకల హేమంత్, కృష్ణ, అశోక్ సామ్రాట్, రామచంద్ర, పుష్పావతి, చిత్తూరు రవిశంకర్, మధుసూదన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆవుదూడతో నిరసన తెలుపుతున్న యాదవ సంఘం నాయకులు

## శెట్టిపల్లె టౌన్‌షిప్ పనులు మొదలుపెట్టండి

● తుడా అభివృద్ధికి ప్రాధాన్యత

● పాలకమండలి సమావేశంలో తీర్మానం



తిరుపతి, డిసెంబర్6(ఆంధ్రజ్యోతి) : తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (తుడా) పరిధిలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. తుడా కార్యాలయంలో శనివారం నిర్వహించిన తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ బోర్డు సమావేశంలో కలెక్టర్‌తో పాటు తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, వీసీ ఎన్.మౌర్య, ఎంఏయూడీ ఓఎస్డీ వెంకట సుబ్బయ్య, ఆర్డీ శ్రీనివాసులు పాల్గొని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. శెట్టిపల్లి టౌన్‌షిప్ ఏర్పాటు చేయనున్న ప్రాంతం చదును, శుభ్రం చేసేందుకు టెండర్ పిలవాలని, పెరుమాళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాలకు గ్యాస్ ఆధారిత శ్మశాన వాటిక, కర్మక్రియల షెడ్డు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు. ఉప్పరపల్లి నుంచి మహిళా విశ్వవిద్యాలయం వరకు నాలుగు లైన్ల రోడ్డుకు, మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రేణిగుంట మండలం సూరప్పకశం వద్ద తుడా పరిధిలో ఏర్పాటు చేసిన పద్మావతినగర్ లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, సీపీఓ దేవికుమారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలి

మంగళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే ఉన్నత అవకాశాలను చేజిక్కించుకోవచ్చని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ చెప్పారు. తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్లో శనివారం బాలల సైన్స్ ఫెస్టివల్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ఫెయిర్ మోడల్స్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, క్రమశిక్షణను అలవరచుకోవాలని తెలిపారు. పురోగతికి దోహదం చేసే పరిశోధనలకు కృషి చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి టెంకాయల దామోదర్ అధ్యక్షత వహించగా రీజనల్ సైన్స్ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ, మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.



విద్యార్థులు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

# పుత్తూరు వార్తలు

## రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఘన నివాళి



పుత్తూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యావత్ ప్రజానీకానికి స్ఫూర్తిదాయకమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. శనివారం అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా పుత్తూరు పట్టణ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. యువత ఆయన ఆశయాలను పుణికిపుచ్చుకుని దేశ ఉన్నతికి కృషి చేయాలని కోరారు. మధుసూదన రాజు, ధనపాల్, భాస్కర్, నాగరత్నమ్మ, పోతుగుంట కృష్ణమూర్తి, శివ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పుత్తూరులో ఘనంగా నిర్వహించారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పుత్తూరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ ట్రస్ట్ భవన్ సభ్యులు అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుప్పయ్య, రాజేంద్ర, మహేష్, రాకేష్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు కఠినం

పుత్తూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా మారిన నేపథ్యంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించక పోతే కేసులతో జీవితాలు పాడైపోతాయని సీఐ శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని కేకేసీ హోమియో వైద్య కళాశాలలో శనివారం మారిన ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపినా, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ వాడినా, హెల్మెట్, లైసెన్సులు లేకపోయినా, మద్యం తాగి నడిపినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కేసులు భవిష్యత్తులో ఉద్యోగాలకు ప్రతిబంధకమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ నరసింహారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరస్వామిని స్వర్ణాభరణాలు, పూలమాలలతో అలంకరించి ఊయలలో అధిష్ఠింపజేసి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహిం చారు. అనంతరం పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివార్లకు మంగళహారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన జైభీమ్ సేన



పుత్తూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి సమక్షంలో నగరి నియోజకవర్గానికి చెందిన జైభీమ్ సేన కాంగ్రెస్ పార్టీలో చేరింది. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా విజయవాడలోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం జైభీమ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పవర్ రామచంద్రన్, రాష్ట్ర నాయకుడు, డీసీసీ అధ్యక్షుడు భాస్కర్, నగరి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సి.కె.కార్తికేయన్ సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్‌తో న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నామని రామచంద్రన్ పేర్కొన్నారు. బాబు, రఘు, సుధాకర్‌పాల్, పళణి ఉన్నారు.

## ఎస్‌ఐలుగా బాధ్యతల స్వీకరణ



అశోక్ - వెంకటలక్ష్మి

పుత్తూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరు అర్బన్, రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు ఎస్‌ఐలు అశోక్, వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం వారుబాధ్యతలు చేపట్టారు. అంతకుముందు డీఎస్పీ రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అశోక్ తిరుచానూరు ట్రైనీ ఎస్‌ఐగా పనిచేయగా, వెంకటలక్ష్మి ఏర్పేడు ట్రైనీ ఎస్‌ఐగా పనిచేశారు. నిబద్ధతగా విధులు నిర్వర్తిస్తామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ ఓబయ్య తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయ రికార్డ్స్ ఇన్‌చార్జిగా బదిలీ అయ్యారు.



**వడమాలపేట (ఆంధ్రజ్యోతి):** వడమాలపేట మండల పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా బి.హరీష్ శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ ధర్మారెడ్డి రేణిగుంటకు బదిలీ అయ్యారు. ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన హరీష్ పాకాల నుంచి బదిలీపై వడమాలపేట వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జూదం, గంజాయి, మద్యం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు.

## నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి

- వాహనదారులకు సీఐ శేఖర్‌రెడ్డి సూచన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

పుత్తూరు అర్బన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): రహదారి నిబంధనలకు అనుగుణంగా వాహనదారులు నడుచుకోవాలని సీఐ శేఖర్ రెడ్డి సూచించారు. శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కేకేసీ కళాశాల, ఆర్డీఎం గేట్ వద్ద వాహనదారులకు పలు సూచనలు చేశారు. బైక్‌దారులు హెల్మెట్ లేకుండా జాతీయ రహదారుల్లో ప్రయాణించరాదన్నారు. అలాగే వాహనానికి సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం నేరమన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ మహమ్మద్, మెతాబ్

పుత్తూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వెంకట పెరుమాల్ కళాశాల వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం ఉదయం పుత్తూరు నుంచి కార్వేటి నగరం వైపు వెళుతున్న ఇద్దరు యువకులు కారును ఢీకొన్నారు. కార్వేటినగరంకు బజార్ వీధికి చెందిన మహమ్మద్(20), ముస్లిం స్ట్రీట్‌కు చెందిన మెతాబ్(20) స్పృహ కోల్పోయారు. వారిద్దరినీ వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి

## డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.1.40 లక్షల జరిమానా

నాయుడుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 14 మందికి నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి రూ.1.40 లక్షల జరిమానా విధించినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. శనివారం మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 14 మందిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

## ఎస్‌ఐగా నిఖిల్ బాధ్యతల స్వీకరణ



వాకాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఎస్‌ఐగా నిఖిల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వాకాడు పోలీసు స్టేషన్‌లో ట్రైనీ ఎస్‌ఐగా ఉన్న ఆయన రెగ్యులర్ ఎస్‌ఐగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్‌ఐ నాగబాబు తిరుపతి వీఆర్‌కు బదిలీ అయ్యారు.



గోతులమయంగా ఉన్న కొరిడి - పేర్నాడు రోడ్డు - ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా మారిన వేనాడు రోడ్డు

## అధ్వానంగా కొరిడి - పేర్నాడు రోడ్డు

### నరకంగా మారిన ప్రయాణం

సూళ్లూరుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి పులికాట్ పల్లెలకు వెళ్లే కొరిడి - పేర్నాడు రోడ్డు అధ్వానంగా మారింది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అట్టకానితిప్ప వద్ద నుంచి పులికాట్ సరస్సు మధ్యలో 9 కిలో మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు వుంది. ఈ దారిలో కొరిడి, కడపత్ర, దామరాయి మూడు పంచాయతీల్లో 23 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు రోడ్డుపై నీళ్లు నిలచి అడుగడుగునా గోతులు ఏర్పడడంతో ప్రయాణం నరకంగా మారింది. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తడ మండలం వేనాడు దీవికి వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇక్కడ ప్రసిద్ధి గాంచిన దర్గా, శృంగేశ్వర శ్రీరంగ పెరుమాల్ ఆలయం ఉంది. ఇక్కడకి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు వచ్చి పోతుంటారు. ఈ రోడ్డులో గమ్యం చేరేవరకు గగనమే. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసెంబ్లీలో ఈ రోడ్ల గురించి ప్రస్తావించినా నేటికీ మోక్షం కలగలేదు.

## సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం దొరవారిసత్రంలో మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. 57 మంది వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఇందులో గ్రామాల్లో రోడ్ల కోసం 21 వినతులు వచ్చాయి. రెవెన్యూ సమస్యలు 13, ఎంపీడీవో కార్యాలయంలో పనుల కోసం 4, అగ్రికల్చర్ 3, ఇరిగేషన్ 3, ఆర్‌అండ్‌బీ రోడ్ల కోసం 3, ఇతర సమస్యలపై మరో 10 వినతులు వచ్చాయి. వాటన్నింటినీ ఆయా శాఖల అధికారులు అందజేసి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన్, తహసీల్దారు శైలాకుమారి, వివిధ శాఖల అధికారులతో పాటు టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, మురళీరెడ్డి, ఇట్టగుంట రత్నయ్య, రమణయ్య, కృష్ణమూర్తి, జాన్ రమేష్, జకరయ్య, చంద్రయ్యనాయుడు షబ్బీర్, పామంజి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గూడూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో శనివారం ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఒకటవ పట్టణ ఎస్‌ఐ మనోజ్ కుమార్ వివరాల మేరకు... నారాయణ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని చల్లకాలువ వాగునుంచి కొట్టుకుని వచ్చిన మృతదేహం చెట్ల పొదల్లో ఇరుక్కుని ఉందన్నారు. మృతుడి వయస్సు ముప్పై ఐదు సంవత్సరాల లోపు ఉండవచ్చునని తెలపారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

## ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

సూళ్లూరుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో శీనయ్య మాట్లాడుతూ దివ్యాంగులు బలహీనులు కాదని, వారిలో ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దితే అత్యున్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మృదుల, ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు ఆలపాటి అశోక్, లలిత, అలవల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రిలో డీఎంహెచ్‌వో తనిఖీలు



బాలిరెడ్డిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో బాలకృష్ణ నాయక్

వాకాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య అధికారి బాలకృష్ణ నాయక్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను, మందులను పరిశీలించారు. వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నామన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలలని సూచించారు.

## నీటి సరఫరాకు చర్యలు

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ తుఫాను కారణంగా గ్రామానికి తాగునీరు అందించే పైప్‌లైన్ మరమ్మతులకు లోను కావడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పైప్‌లైనుకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు

గూడూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు చేపడుతామని రూరల్ ఎస్‌ఐ తిరుపతయ్య అన్నారు. శనివారం జాతీయ రహదారి పోటుపాళెం కూడలి వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తగిన ధృవీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కేసు నమోదు

బాలాయపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చారు చేను గ్రామంలో ఇంటి స్థలం విషయమై చంద్రగిరి అంకమ్మ అనే మహిళను అదే గ్రామానికి చెందిన నర్రావుల మనోహర్ నాయుడు, ఆయన కుమారులు నరేష్, మునిరాజ దాడి చేశారు. అంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## విద్యార్థులు బాధ్యతతో మెలగాలి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాధ్యతతో మెలగాలని సీఐ రమణ అన్నారు. శనివారం వేదాంత్ కళశాలల్లో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచి, చెడు ఉంటాయని, విద్యార్థులు సన్మార్గంలో నడవడం అలవాటు చేసుకోవాలన్నారు. మైనర్లు వాహనం నడపం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు కూడా శిక్షార్హులు అవుతారన్నారు. రాజావీధిలో వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమణ



గూడూరు, సూళ్లూరుపేటల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, ఎమ్మెల్యే విజయశ్రీ

## ఆదర్శనీయుడు అంబేడ్కర్

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు ఎంతో కృషిచేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అశోక్‌నగర్‌లో నీళ్లట్యాంకు సమీపంలో గల అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, కొత్తపల్లి వసంత్‌కుమార్, ప్రతాప్, మనపాటి శ్రీను, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. కోర్టు ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగ పవన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బీ.సులోచనారాణి, న్యాయవాదులు అరవపార్వతయ్య, మెహబూబ్‌బాషా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

**సూళ్లూరుపేట:** పట్టనంలోని ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, బుజ్జయ్య, పెంచలయ్య, రమణయ్య, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, మునస్వామి, జయచంద్ర, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేట టౌన్:** పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, రఫీ, జీవీఆర్ నాయుడు, రాజేంద్ర, లక్ష్మయ్య, నిత్య కృష్ణారెడ్డి, సుబ్బారావు, పొట్లపూడి రాజేష్, ధనంజయ, నాగరాజు, మస్తాన్, మైలారి రాజశేఖర్, జయరామయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.



గూడూరు కోర్టులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయమూర్తులు వెంకటనాగ పవన్‌కుమార్, సులోచనారాణి - నాయుడుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నెలవల సుబ్రహ్మణ్యం నివాళులు

## స్వర్ణముఖి నదిలో తగ్గని వరద ఉధృతి



రుద్రవరం, ఊనుగుంటపాళెం గ్రామాల మధ్య మామిడికాలువ పొంగడంతో తెగిపోయిన్న రోడ్డు

కోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి, రుద్రవరం, తిన్నెలపూడి వద్ద స్వర్ణముఖినదిలో శనివారం కూడా వరద ఉధృతి తగ్గలేదు. ఎగువ ప్రాంతాల నుంచి స్వర్ణముఖిలోకి వదర వస్తుండటంతో నదిలో ప్రవాహం తగ్గలేదు. ఊనుగుంటపాళెం, రుద్రవరం గ్రామాల మీదుగా వెళ్లే మామిడికాలువ వరదనీటితో ఉప్పొంగడంతో రెండుచోట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా తెగిపోయి గండ్లు పడ్డాయి. దీంతో ఊనుగుంటపాళెం, రుద్రవరం గ్రామాలకు ఐదు రోజుల నుంచి దారి సౌకర్యం లేదు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి విష్ణువర్మ

వెంకటగిరి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వెంకటగిరి సివిల్ జడ్జి విష్ణువర్మ కోరారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 13వ తేదీన నిర్వహించే లోక్‌అదాలత్‌లో కక్షిదారులు రాజీమార్గం ఎంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన



టీడీపీ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు

నాయుడుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయ నిర్మాణం కోసం నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం శనివారం స్థల పరిశీలన చేశారు. తహసీల్దారు రాజేంద్రతో కలసి నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, నాయకులు రఫీ, జీవీఆర్ నాయుడు, రాజేంద్ర, లక్ష్మయ్య, నిత్య కృష్ణారెడ్డి, సుబ్బారావు, పొట్లపూడి రాజేష్, ధనంజయ, నాగరాజు, మస్తాన్, మైలారి రాజశేఖర్, జయరామయ్య, గోపి, ఎన్‌సీఆర్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ తప్పనిసరి

పెళ్లకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ నాగరాజు అన్నారు. శనివారం రాత్రి తాళ్వాయిపాడు సమీపంలోని అండర్ పాస్ వద్ద హెల్మెట్ లేకపోవడంతో జరిగే నష్టాలను వివరిస్తూ రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మొబైల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

## గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని, లేని పక్షంలోజిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు ప్రజల ఆకాంక్షను ముఖ్యమంత్రికి తెలియజేయడానికి పోస్టుకార్డులు పంపడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభు, వాసుదేవరావు, సుబ్రహ్మణ్యం, దాసు, సునీల్, సిరాజ్, అనిల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

వాకాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాకాడు ముస్లిం కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ కాలేషా అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని పార్టీ నాయకులు పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేలు అందజేశారు. షేక్ రహంతుల్లా, మీరామొహిద్దీన్ పాల్గొన్నారు.

## ఎస్టీయూ నూతన కార్యవర్గం

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం బుచ్చినాయుడు కండ్రిగ కార్యవర్గాన్ని శనివారం జడ్పీ హైస్కూల్‌లో ఎస్టీయూ సీనియర్ నాయకుడు యువశ్రీ మురళి, లక్ష్మయ్య, గజేంద్ర పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా చైతన్య, లీలాప్రసాద్, బాలసుబ్రమణ్యం, రవి, జగదీష్, ప్రధాన కార్యదర్శిగా మునిశేఖర్, ట్రెజరర్‌గా జగన్నాథం, గౌరవ అధ్యక్షుడిగా నాదెండ్ల మురళి, గౌరవ సలహాదారుగా పార్థసారథి, కార్యదర్శులుగా ప్రవీణ, పద్మావతి, తిరుమలరావు, మహిళా కన్వీనర్‌గా అనిత సీపీఎస్ కన్వీనర్‌గా వినోద్, పవన్, మైనారిటీ కన్వీనర్‌గా మీర్జాన్‌బీని ఎన్నుకున్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న గాలి చలపతినాయుడు తదితరులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం ఇలగనూరు పంచాయతీ గురవయ్య నాయుడు ఎస్టీకాలనీలోని 40 కుటుంబాలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ గురవయ్యనాయుడు జ్ఞాపకార్థం యేటా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఆయన అప్పటి మంత్రి బొజ్జలతో చర్చించి కొణతనేరి పంచాయతీలోని ఎగువ, దిగువ కొణతనేరి చెరువుల్లో గిరిజనులు చేపలు పట్టుకునే విధంగా అప్పటి కలెక్టర్‌ద్వారా జీవో చేయించారన్నారు. నేటి వరకు హక్కులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో లెక్కల రవినాయుడు, మునికుమార్, బుజ్జి నాయుడు, కస్తూరయ్య పాల్గొన్నారు.

## అమర హాస్పిటల్‌లో తుంటి సమస్యలపై సదస్సు


అత్యాధునిక వైద్యంపై ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రసాద్

రేణిగుంట డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర హాస్పిటల్‌లో తుంటి సంబంధిత సమస్యలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆర్థోపెడిక్ నిపుణులు ఆధునిక శస్త్రచికిత్స అంశాలపై అనుభవాలను పంచుకున్నారు. అమర హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరీనేని మాట్లాడుతూ... ఇటీవల యువతలో తుంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్యం పరిజ్ఞానాన్ని పంచుకోవడం అత్యవసరమని చెప్పారు. వివిధ రాష్ట్రాల నిపుణులు ఒకే వేదికపై ఆధునిక విధానాలపై చర్చించడం రోగులకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఇలాంటి శాస్త్రీయ కార్యక్రమాల ద్వారా వైద్య సేవల నాణ్యత మెరుగుపడుతుందన్నారు.

## ప్రధాని మోదీతోనే అటల్ సూపర్ పాలన

రేణిగుంట డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): అటల్ సుపరిపాలన ప్రధానమంత్రి మోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో మర్రిగుంట కూడలి వద్ద డిసెంబర్ 14న మోదీ అటల్ సందేశ్ యాత్ర, భారతరత్న అటల్ బిహారి వాజపేయి విగ్రహ ఆవిష్కరణ కోసం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి , పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ముని సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మీడియా ప్రతినిధి గాలి పుష్పలత, చంద్రప్ప, బాలాజీ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం


మొక్కలను నాటుతున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని జనసేన నాయకులు అన్నారు. మన పర్యావరణం.. మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా శనివారం రామాపురం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తేజ, పసలసురేష్, నవీన్, భానుప్రకాష్, పలస ఎలీసా, మునికుమార్, గపి తదితరులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న కారు: డ్రైవర్‌కు తీవ్రగాయాలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని కారు ఆటోను ఢీకొని వెళ్లిపోవడంలో డ్రైవర్ నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శనివారం శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సమీపంలో పీఎస్ రహదారిపై చోటుచేసుకుంది. పట్టణంలోని పిట్టలవారి సందుకు చెందిన నాగరాజు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం రైల్వేస్టేషన్ వద్ద వెళుతుండగా గుర్తు తెలియని కారు ఢీకొని వెళ్లిపోయింది. దీంతో క్షతగాత్రుడిని స్థానికుల చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

## ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో

### ఆటో ప్రయాణికుడి పరిస్థితి విషమం

కేవీబీపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో బైరాజులకండ్రిగ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొనింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. కోవనూరు నుంచి ఏడుగురు ప్రయాణికులతో శ్రీకాళహస్తి వస్తూ బైరాజుల కండ్రిగ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న కోవనూరుకు చెందిన వీరాస్వామి(63) అపస్మారకస్థితికి చేరుకున్నాడు. మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే అంబులెన్సులో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరాస్వామి పరిస్థితి విషమంగా ఉండటంతో రేణిగుంట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

## అమానుషంగా కొడుతున్నాడంటూ అధ్యాపకుడిపై ఫిర్యాదు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు విద్యార్థులను అమానుషంగా కొడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని పెద్దమసీదు వీధిలో ఉన్న జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు తమ బిడ్డను చెయ్యి కమిలిపోయేలా కర్రతో కొట్టాడని, ఇదే తరహాలో చాలామంది విద్యార్థులు బాధపడుతున్నారని తల్లిదండ్రులు సామాజిక మాధ్యమాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సందేశం శనివారం పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

నాగలాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఎస్ఐ సునీల్ తెలిపిన వివరాలు... నింద్ర మండలం కొప్పేడుకు చెందిన కమలచందర్ (37) ఆర్థిక ఇబ్బందులతో గ్రామం వదిలి తన భార్య మాతా సొంతూరు నాగలాపురం మండలం ఎస్ఎస్‌పురానికి చేరుకున్నాడు. అప్పులు తీర్చలేక పోవడం, కుటుంబ ఖర్చులు పెరిగి పోవడంతో మనస్తాపానికి గురై ఈనెల 4వ తేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కమలచందర్‌ను నాగలాపురం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స నందించి, మెరుగైన చికిత్స కోసం రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

## మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బస్సు ఎక్కే క్రమంలో మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైందని మహిళ శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ శివారు బంగారమ్మకాలనీకి చెందిన శైలజ నాయుడుపేటలోని బంధువుల ఇంట్లోని శుభకార్యానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండుకు వచ్చింది. బస్సు ఎక్కే క్రమంలో తన మెడలోని 30 గ్రాముల బంగారు గొలుసు చోరీ జరిగినట్లు కాసేపటి తరువాత గుర్తించింది. ఈ మేరకు ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సృజనాత్మకతను జోడించిన నో బ్యాగ్ డే

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం దిగువసాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో మొదటి శనివారం నోబ్యాగ్ డే నిర్వహించారు. ఉపాధ్యాయులు కయ్యూరి బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ రకాల కార్యక్రమాల్లో ఆనందంగా పాల్గొన్నారు. నీతి కథలు, బాల గేయాలు, యూట్యూబ్ ద్వారా ప్రదర్శించారు. ఆట, పాటలతో అభినయాలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు.

## వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ, గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వులనూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు.

## పారుతున్న కాళంగి జలాశయం కలుజు

కేవీబీపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసినవర్షాలకు కాళంగి జలాశయం నిండింది, గేట్లు మూసివేశారు. జలాశయానికి అనుసంధానంగా ఉన్న ఆదరం వద్ద ఉన్న కలుజు ఉధృతంగాపారుతోందని ఆయకట్టు అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. కలుజు ప్రవాహంతో ప్రమాదాలు జరగకుండా అక్కడ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

### కోటి సంతకాల సేకరణ

వరదయ్యపాళెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల కోసం మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించి ప్రైవేటీకరణ రద్దు చేయాలని సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు, సీఎల్ఎన్ పల్లి సర్పంచ్ దుద్దు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మిట్ట హరిజనవాడ, లక్ష్మీపురంలో కోటి సంతకాలు కార్యక్రమం చేపట్టారు.

# బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్


శ్రీకాళహస్తి పట్టణం, బీఎన్‌కండ్రిగ, ఏర్పేడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని పలువురు నాయకులు కొనియాడారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. శ్రీకాళహస్తి టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. వైసీపీ నేత అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. పసల కృష్ణయ్య, గుమ్మడి బాల కృష్ణయ్య, ఈశ్వరయ్య, షేక్ సిరాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెంలో టీడీపీ మండల అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ బత్తిరెడ్డి, రాఘవరెడ్డి ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్, న్యాయవాది పుష్పలత, సీపీఐ నాయకులు గురవయ్య, చారులత తదితరులు పాల్గొన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు.

**కేవీబీపురం (ఆంధ్రజ్యోతి):** అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని అంబేడ్కర్ సేవా సంఘం సభ్యులు శనివారం తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి):** మండలంలో అంబేడ్కర్ 69వ వర్ధంతిని దళితులు, టీడీపీ, వైసీపీ, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. పల్లమాలలో కూడా అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో దళిత నాయకులు కత్తి ధర్మయ్య, గురవయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు మణినాయుడు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఏర్పేడు (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధనంజయులు నాయుడు, నాగరాజునాయుడు, కృష్ణవేణమ్మ, రాచేటి సుబ్రహ్మణ్యం, కేకే రమణ, సర్పంచ్ గుణయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అదే తహసీల్దారు కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి రెవెన్యూ అధికారులు నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సౌభాగ్యం, ఏవో కోమలేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సత్యవేడు (ఆంధ్రజ్యోతి):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ అందరివాడని సత్యవేడు మండల టీడీపీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం సత్యవేడులో వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. పరమశివం, చంద్రశేఖర్‌రెడ్డి, షణ్ముగం, ఎంఎం రవి, సుధాకర్, శివానందం, హేమభూషణ్‌రెడ్డి, ధన చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో, కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు అరుణా చలం ఆధ్వర్యంలో కూడా నివాళి కార్యక్రమాలు జరిగాయి.


సత్యవేడులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు

**నాగలాపురం (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, నాయకులు సెల్వకుమార్, పార్తిబన్ ప్రణీత రెడ్డి, నమఃశివాయం, చాంద్‌బాషా, రుద్ర య్య నాయుడు, మనోజ్ నాయుడు, యమునమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పలు సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని నీరువాయి, గోవర్ధనగిరి గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు.

## రేపు ఎస్వీపీఏలో క్యాంపస్ డ్రైవ్

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీపీఏ పురుషుల డిగ్రీ కళాశాలలో సోమవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు తెలిపారు. కోకాకోలా కంపెనీ అప్రెంటిస్‌షిప్ కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. డిగ్రీ, ఇంటర్, ఐటీఐ చదివి, 35సంవత్సరాల లోపు మహిళలు, పురుషులు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, విద్యార్హత పత్రాలు, ఫొటోలతో ఈనెల 8న సోమవారం ఉదయం 10గంలకు కళాశాలలో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి రూ.15వేలు జీతం, ఉచిత ఆహారం, రవాణా ఉంటుందన్నారు. వివరాలకు నెం.9440502338, 7981473129లలో సంప్రదించవచ్చు.

## జగన్ దిష్టిబొమ్మ దహనం


సాయిబాబా ఆలయం వద్ద జగన్ దిష్టిబొమ్మను తగులబెడుతున్న టీడీపీ నాయకులు

కేవీబీపురం, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై మాజీ సీఎం జగన్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను కేవీబీపురంలోని సాయి బాబా ఆలయం సమీపంలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీతి నియమాలకు కట్టుబడిఉన్న సామాజికవర్గానికి చెందిన యాదవ కులానికి చెందిన ఐఏఎస్, ఐపీఎస్‌లను ప్రత్యేకించి మాట్లాడటం సరికాదన్నారు. ఇందుకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. ఇలాంటి వాఖ్యలు ఎక్కడ చేసినా జగన్ మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. టీడీపీ నాయకులు ప్రకాష్‌నాయుడు, మునికృష్ణారెడ్డి, రఘుయాదవ్, వాసు, నాగరాజుయాదవ్, బాలయ్య, వెంకటయ్య, నాగరాజు,మోహన్, అఖిల్,చంద్ర, గిరి, బాల తదితరులు పాల్గొన్నారు.

## కుల అహంకారానికి జగన్ ప్రతిరూపం


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కుల అహంకారానికి మాజీ సీఎం జగన్ ప్రతి రూపమని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జగన్ తనజీవితమంతా స్వార్థం, మోసం, కుట్ర, దోపిడీ వంటి అనైతిక చర్యలకు అంకితం చేశారని ఎద్దేవా చేశారు. టీడీపీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న బీసీల పట్ల ఆయనకు తీవ్రమైన హేయభావం నరనరాన జీర్ణించుకుపోయిందన్నారు. బీసీ వర్గానికి చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి కృష్ణయ్య, డీఐజీ గోపీనాథ్‌జెట్టిని వ్యక్తిగతంగా దూషించడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అక్రమాలపై కూటమి ప్రభుత్వం ఒకవైపు, దేశ అత్యున్నత న్యాయస్థానం మరోవైపు విచారణ చేయిస్తుంటే జగన్ భుజాలు తడుము కుంటున్నా రన్నారు. కామేష్‌యాదవ్, మిన్నల రవి, మునిరాజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గోవర్ధనపురం బ్రిడ్జిపై గుంతల పూడ్చివేత



వరదయ్యపాళెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడ - శ్రీకాళహస్తి ప్రధాన రహదారిలో పాముల కాలువపై నిర్మించిన గోవర్ధనపురం బ్రిడ్జిపై గుంతలకు టీడీపీ నాయకులు మరమ్మతులు చేపట్టారు. నిరంతరం పరిశ్రమల కార్మికుల రవాణా ఇబ్బందిగా మారుతుండడాన్ని గమనించిన టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి , కాంబాకం యూనిట్ ఇన్‌చార్జి సురేష్‌రెడ్డి, సింగిల్ విండో సభ్యుడు రవిరెడ్డి ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో మిక్సింగ్ జల్లి తోలి గుంటలను పూడ్చడంతో ప్రయాణికులు, పరిశ్రమలకు వెళ్లే కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

## భూసారం ఆధారంగా ఎరువుల వినియోగం

ఏర్పేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే నేల ఆరోగ్యంగా ఉంటుందని ఏవో సాగరిక అన్నారు.మండల కేంద్రంలో తిరుపతి జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్‌లో రైతులు తమ పొలాల్లోని మట్టి నమూనాలను భూసార పరీక్షలకు పంపిన వారందరూ రైతు సేవా కేంద్రాల ద్వారా ఫలితాల కార్డులను తీసుకోవాలన్నారు.

### రెండో పట్టణ ఎస్ఐగా జ్యోతి



శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తి రెండవ పట్టణ ఎస్ఐగా జ్యోతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ట్రైనీ ఎస్ఐగా తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించారు. అనంతరం ఉన్నతాధికారులు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు ఆమె శనివారం బాధ్యతలు చేపట్టారు.

### నారాయణవనం ఎస్ఐగా...


శ్రీనివాసులు

నారాయణవనం, (ఆంధ్రజ్యోతి): నారాయణవనం ఎస్ఐగా వై.శ్రీనివాసులు శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. మొదటి పోస్టింగ్ కల్యాణ వెంకన్న నిలయమైన నారాయణ వనంలో రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న రాజ శేఖర్ పాలసముద్రం మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, శాంతి భద్రతలకు ఆటంకం లేకుండా చేస్తానని తెలిపారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు.

### జడ్పీ సమావేశంలో...
### రోడ్ల దుస్థితిపై ఎంపీపీ ప్రస్తావన

సత్యవేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చిత్తూరులో శనివారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో సత్యవేడు మండలంలో పలు మార్గాల్లో దెబ్బతిన్న రోడ్ల దుస్థితిపై ఎంపీపీ ప్రతిమ ప్రస్తావించారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో పలు అంశాలను ఎంపీపీ ప్రతిమ లేవనెత్తారు. ప్రధానంగా సత్యవేడు - ఊత్తుకోట, సత్యవేడు - మాదరపాకం, వెంకటరాజుల కండ్రిగ - నాగలాపురం రోడ్లు గుంతలమయంగా మారాయని సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లకు మరమ్మతులు చేయించి వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సత్యవేడు మండలం ఇరుగుళం హైస్కూలును జూనియర్ కళాశాల స్థాయికి పెంచాలని విజ్ఞప్తి చేశారు. జడ్పీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.